క్లుప్తంగా

అక్రమ గేట్ వసూళ్లపై ఆగ్రహం



ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్ : నగరంలో వీధి వ్యాపారుల నుంచి అక్రమంగా గేట్ వసూలు చేయడంపై సీపీఐ జిల్లా కార్యదర్శి కందారపు మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ ఆధ్వర్యంలోసోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ఐదు వేల మందికిపైగా వీధి వ్యాపారులు ఉన్నారని, వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గేట్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ మౌర్యకు వినతి పత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివకుమార్, ఏఐటీయూసీ నేతలు కేవై రాజా, ఎన్‌డీ రవి, సీపీఐ నేత విశ్వనాథ్, వీధి వ్యాపారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, బాలాజీ, సుధాకర్, సురేష్, బాల, ఎల్‌కే నాయుడు, వెంకటేష్, మహేంద్ర పాల్గొన్నారు.

మనోధైర్యంతో క్యాన్సర్‌పై విజయం

తిరుపతి కల్చరల్ : ఆత్మవిశ్వాసం, మనోధైర్యంతో క్యాన్సర్‌పై విజయం సాధించవచ్చని పంచాయతీ కార్యదర్శి లావణ్య, టాటా ట్రస్ట్ ప్రతినిధి హేమంత్ తెలిపారు. సోమవారం మంగళం క్వార్టర్స్ పంచాయితీలోని రాస్ క్లస్టర్ కార్యాలయంలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడి వారికి జీవితంపై ఆశలు కల్పించేలా రాస్ కృషి చేస్తోందని కొనియాడారు. వ్యాధిని మందులతో 50శాతం, సంకల్ప బలంతో 50 శాతం తగ్గించవచ్చని వెల్లడించారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. ఈ సందర్భంగా 150 మంది మహిళలకు బీపీ, షుగర్ ,హైపటైటిస్, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. రాస్ ప్రతినిధులు నాగేశ్వర్, బాలాజీ, జ్యోతి శుభవల్లిత, వెంకటలక్ష్మి, దేవకి, లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

విద్యావేత్తకు ఘన సత్కారం



పద్మావతిని సన్మానిస్తున్న అధ్యాపకులు, అతిథులు

తిరుపతి సిటీ : విశిష్ట ప్రతిభా కళాకారిణి, విద్యావేత్త డాక్టర్ పద్మావతిని సోమవారం శ్రీపద్మావతి వర్సిటీలో పీపుల్స్ ఫ్రంట్ వారు ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం–2019 పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం బాధాకరమన్నారు. ఈ చట్టం సక్రమంగా అమలైతే చాలామందికి మేలు చేకూరుతుందని తెలిపారు. విద్యార్థులు నిరంతర కృషితో రాణించి గురువులు, తల్లిదండ్రులతోపాటు యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు మాధురి పరదేశి, తవితా తులసి, పీపుల్స్ ఫ్రంట్ ప్రతినిధి నాగరాజు, ఉమాశంకర్, ఇందిర, జగన్నాథం, నాగన్న పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి కృషి



బాధిత కుటుంబానికి చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల : గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. సోమవారం మండలంలోని రమణయ్యగారిపల్లెలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం కంబాలమిట్టలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విజయమ్మ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్ అందజేశారు.

పురస్కార గ్రహీత సన్మానం

తిరుపతి కల్చరల్ : తిరుపతి సిటీ చాంబర్ నుంచి జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న కళాకారుడు కొత్తపల్లె మునిరత్నాన్ని సోమవారం పలువురు రంగస్థల కళాకారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేవీఎన్ రాజా పాల్గొన్నారు

పర్యాటకులను ఆకర్షించేలా హంగులు

తిరుపతి అర్బన్: పర్యాటకులను ఆకర్షించేలా చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైట్స్ షోను తీర్చిదిద్దాలని కలెక్టరేట్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో టూరిజం అధికారులతో ఆయన సమీక్షించారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పర్యాటక శాఖ, లక్స్ అండ్ డెసిబెల్స్ భాగస్వామ్యంతో పీపీపీ విధానంలో చంద్రగిరి కోట అభివృద్ధికి రూ.6కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 27న ముఖ్యమంత్రి వర్చువల్‌గా లైట్స్ షోను ప్రారంభిస్తారని తెలిపారు. పర్యాటక శాఖ అధికారి రమణ ప్రసాద్, ఏపీటీడీసీ డీవీఎం గిరిధర్ రెడ్డి, ఈఈ సుబ్రమణ్యం, జిల్లా టూరిజం అధికారి రూపేంద్రనాథ్ రెడ్డి, కేంద్ర ఆర్కియాలజీ సబ్ సర్కిల్ ఇన్‌చార్జ్ ప్రవీణ్ కుమార్, డెసిబుల్స్ ప్రతినిధి శివ పాల్గొన్నారు.

వివిధ ఆకృతులలో పలువురు వేయించుకున్న టాటూలు



టాటూస్ ట్రెండ్!

నేటి ఆధునిక సమాజంలో యువత ఫ్యాషన్ ప్రపంచంలో మునిగితేలుతోంది. డిజైనర్ దుస్తులు.. బ్రాండెడ్ వస్తువులను వినియోగించేందుకే మొగ్గుచూపుతోంది. ఈ క్రమంలోనే టాటూ సంస్కృతి శరవేగంగా పెరిగిపోతోంది. పెద్దల నుంచి పిల్లల వరకు రకరకాల పచ్చబొట్టును వేయించుకుంటున్నారు. మెడపైన పలువురు . చేతి మీద కొందరు.. వీపుపై మరి కొందరు.. హృదయంపై ఇంకొందరు ఆకట్టుకునే డిజైన్లు ముద్రించుకుంటున్నారు. అయితే టాటూస్ ట్రెండ్‌లోకి అడుగుపెట్టే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు కోరుతున్నారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రమాదకర రోగాల బారిన పడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

- పచ్చబొట్టు వైపు మొగ్గుతున్న యువత
- అందుబాటులో వివిధ రకాల డిజైన్లు
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు
- పరిశుభ్రత పాటించాలంటున్న వైద్యులు

తిరుపతి మంగళం : నేను ఫ్యాషన్ లవర్‌ను అని చెప్పకుండానే తెలియజేసే మార్గం టాటూ. ఇప్పుడు వయసుతో పనిలేకుండా అన్ని వర్గాల వారూ టాటూస్ ముద్రించుకోవడం నగరంలో సర్వసాధారణంగా కనిపిస్తోంది. వాస్తవానికి ఎప్పటి నుంచో టాటూ వేయించుకోవడం వినియోగంలో ఉంది. ఈ క్రమంలోనే కొత్తగా వాటి పట్ల ఆసక్తి పెంచుకుంటున్న వారికీ కొదవలేదు. ఈ నేపథ్యంలో ఎంత ఫ్యాషన్ అయినప్పటికీ టాటూ వేయించుకోవాలంటే ముందు కొన్ని జాగ్రతలు తప్పవని నిపుణులు చెబుతున్నారు.

ప్రిపరేషన్ తప్పనిసరి

టాటూ వేయించుకోవానికి ముందుగా సైడ్‌ఎఫెక్ట్స్ గురించి కూడా తెలుసుకోవాలి. అప్పుడే ప్రిపరేషన్ లోపిస్తే వచ్చే పరేషాన్ ఏమిటో అర్థమవుంది. టాటూ వేయడానికి ముందు, దానికి వినియోగించే సూదులు క్రిమిరహితంగా ఉన్నాయని నిర్ధారించుకోవడం చాలా ముఖ్యం. స్టెరిలైజ్ చేయని లేదా కలుషితమైన సూదులను ఉపయోగిస్తే హెచ్ఐవీ, హెపటైటిస్–బి, సి వంటి రక్తం ద్వారా సంక్రమించే



ఛాతీపై టాటూ వేస్తున్న మహిళా ఆర్టిస్ట్

వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. వెంటనే లేదా టాటూ వేసిన మొదటి రెండు వారాల్లో స్కిన్ ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశముంది. వాపు, నొప్పి, ఎరుపు, దురద లేదా దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటాయి. తీవ్రమైన సందర్భాల్లో జ్వరం, పుండ్లు పడి చీముకు దారితీస్తుంది. శరీరంలోకి ఇంజెక్ట్ చేసే ముందు నాన్ స్టెరైల్ వాటర్‌ని కలిపితే స్కిన్ ఇన్ఫెక్షన్ కూడా రావచ్చు. కాబట్టి తరచి చూసుకోవడం అవసరం. ఎంఆర్‌ఐ స్కానింగ్ చేయించుకున్న రోగులకు పచ్చబొట్టు పొడిచిన ప్రదేశంలో మంట, దురద లేదా వాపును అనుభవించవచ్చు. ఇది తక్కువ నాణ్యత లేని రంగులు లేదా టాటూ పిగ్మెంట్లలో ఐరన్ ఆక్సైడ్ వంటి రసాయనాల వల్ల కూడా ఇన్‌ఫెక్షన్ రావచ్చు. టాటూ వేయడానికి అయ్యే ఖర్చు కళాకారుడిపై మాత్రమే కాక ఉపయోగించిన సిరా రకం, పచ్చబొట్టు పరిమాణం, ఇంక్ చేయాల్సిన ప్రాంతం మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుంది. ఖర్చుతో రాజీపడకుండా పేరున్న కళాకారుడితో టాటూ వేయించుకోవడం మేలు. టాటూ వేయించుకున్న కొన్ని నెలల తర్వాత రంగు వాడిపోతుంది. కాబట్టి రంగు సాంద్రతను స్థిరీకరించడానికి కొన్ని టచప్‌లు అవసరం కావచ్చు. స్కిన్ ఇన్‌ఫెక్షన్ లేదా ఇతర సమస్యలను నివారించడానికి టాటూ అనంతర సంరక్షణ చాలా ముఖ్యం. ఆ ప్రాంతంలో పూర్తిగా నయం అయ్యే వరకూ కళాకారుడి సలహాలను పాటించాలి. టాటూ వేసే పదాల స్పెల్లింగ్‌లు సరైనవని నిర్ధారించుకోవాలి. ఒక్కసారి టాటూ పూర్తయిన తర్వాత అక్షరదోషాలను సరిదిద్దలేరు. మధుమేహం నియంత్రణలో లేకుంటే



చేతిపై పచ్చబొట్టు వేస్తున్న దృశ్యం

వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. టాటూ ఆర్టిస్ట్ చేతులను కడుక్కొని స్టెరిలైజ్ చేసుకున్న తర్వాత టాటూ ప్రక్రియకు ముందు కొత్త గ్లౌజ్‌లు ఉపయోగిస్తున్నారని నిర్ధారించుకోండి. ప్రక్రియకు 24 గంటల ముందు కెఫీన్ లేదా ఆల్కహాల్ తీసుకోకూడదు. టాటూ కోసం ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోవలసి ఉంటుంది. కాబట్టి వదులుగా, సౌకర్యవంతంగా ఉండే దుస్తులను ధరించడం ఉత్తమం. కనీసం 24 నుంచి 48 గంటల ముందు రక్తాన్ని పలచబరిచే మందులను తీసుకోకుండా ఉండడం అవసరం.

అనారోగ్య 'ముద్ర' ..

అనస్తీషియా లేకుండా టాటూ వేయడం వల్ల కొంత నొప్పి, రక్తస్రావం కలిగే అవకాశం ఉంది. దీని గురించి ముందుగా తెలుసుకోవడం అవసరం. అలాగే టాటూ ఇంక్‌లో ఉండే రసాయనాలు లేదా లోహాలు, ప్రత్యేకించి కొన్ని రంగులు కారణంగా కొంతమందిలో అలర్జీ వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు దురద, దద్దుర్లు, వాపు తదితర లక్షణాలు టాటూ వేయించుకున్న వెంటనే లేదా కొన్ని సంవత్సరాల తర్వాత కూడ కనపడవచ్చు. టాటూల వల్ల అరుదుగా చర్మకారక క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదముంది. ఎందుకంటే కొన్ని రంగులు లేదా వర్ణ ద్రవ్యాలు క్యాన్సర్ కారకాలు కావచ్చు.

జాగ్రతలు ఇలా...

- స్వతహాగా చర్మ అలర్జీలకు గురయ్యే శరీర తత్వం ఉంటే లేదా ముందుగా వ్యాధులు ఏవైనా ఉంటే పచ్చబొట్టు వేయించుకునే ముందు వాటి గురించి వైద్యునితో చర్చించి వారి సలహా మేరకు టాటూ వేయించుకోవాలి.
- క్రిమి రహితం చేసిన సూదులు, మంచి నాణ్యమైన పిగ్మెంట్లు, ప్రమాణాలు పాటించే లైసెన్స్ పొందిన టాటూ స్టూడియోను ఎంచుకోవాలి.
- పచ్చబొట్టు వేసుకునే రోజున ప్రక్రియ సమయంలో ఆకలి బాధలు, తల తిరగడం లేదా మూర్ఛ వంటివి నివారించడానికి పుష్కలంగా నీరు తాగాలి. తగినంత ఆహారం తీసుకోవాలి. టాటూ వేయించుకోవడానికి ముందు రోజు రాత్రి తగినంత నిద్ర పోవాలి.

శుభ్రతతో సురక్షితం



టాటూకి సురక్షితమైన ప్రొఫెషనల్ స్టూడియోను ఎంచుకోవాలి. ఆ ప్రదేశం కూడ పూర్తి పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా ఉండాలి. ఎటువంటి సందేహాలు కలిగినా ఆర్టిస్ట్‌ను ప్రశ్నించాలి. నీడిల్స్ తమ ముందే ఓపెన్ చేయాలని కోరాలి. రీ యూజబుల్ మెటీరియల్ అంతా ఆటో క్లోవ్‌లో స్టెరైల్ చేశారో లేదో గమనించాలి. అలాగే టాటూ వేసే సమయంలో నొప్పి భరించగలిగినంతే ఉంటుంది. అయితే శరీరంలో తల, పాదాలు, చేతుల అడుగు భాగం, పొత్తికడుపు, వెన్నెముక వంటి కొన్ని భాగాల్లోని చర్మ స్వభావం వల్ల కొంచెం నొప్పి ఎక్కువగా అనిపించవచ్చు. టాటూ వేసే సమయంలో వేసిన తర్వాత కొన్ని రోజుల పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పూర్తిగా తెలుసుకోవాలి.

– శేఖర్, టాటూ ఆర్టిస్ట్

---

25 నుంచి క్రీడాపోటీలకు ఎంపికలు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వివిధ క్రీడలకు సంబంధించి తిరుపతి నియోజకవర్గ స్థాయి అండర్–14, 17 బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎస్.నసీమా, మండల స్థాయి కో–ఆర్డినేటర్ జి.శోభన్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 25న తుమ్మలగుంట మైదానంలో అథ్లెటిక్స్, 27న ఎమ్మార్‌పల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో కబడ్డీ, ఖోఖో, 28న వాలీబాల్, యోగా, చెస్, 30న బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ముందుగా ఎస్‌జీఎఫ్ మానిటరింగ్ యాప్‌లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

దూర విద్య పరీక్షల నిర్వహణకు వినతి

తిరుపతి సిటీ : ఎస్వీయూ దూరవిద్యకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పరీక్షలను వెంటనే నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్ కోరారు. సోమవారం ఈ మేరకు వీసీ అప్పారావుకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ దూరవిద్యలో అడ్మిషన్లు పొందివారు పరీక్షలు నిర్వహించకపోవడంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

28న బహిరంగ వేలం

చంద్రగిరి : చంద్రగిరి పంచాయతీ ఆదాయ వనరుల బహిరంగ వేలం పాటను శనివారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ ముదికుప్పం రూపారామ్మూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారపు సంతకు రూ.4.5లక్షలు, ప్రైవేటు బస్టాండ్‌కు రూ.1.5లక్షల, జంతు వధశాలకు రూ.20వేలు, దినసరి కూరగయాల మార్కెట్‌కు రూ.40వేలను ముందుగా డీడీ రూపంలో చెల్లించాలని వెల్లడించారు.

అథ్లెటిక్స్‌లో ఎడిఫై విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

చంద్రగిరి(తిరుచానూరు): సీబీఎస్‌ఈ జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో తిరుచానూరులోని ఎడిఫై పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బాలుర అండర్–14,17,19 విభాగాలలో 8 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు, 1 కాంస్య పతకం సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకున్నారు. బాలికల అండర్–14, 17, 19 విభాగాలలో 20 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు, 1 కాంస్య పతకం సాధించారు. సోమవారం ఈ మేరకు విజేతలను శ్రీపద్మావతి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ సులోచన అభినందించారు. డైరెక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన అదితి, చరణి, తనిష్కకు వందశాతం స్కాలర్‌షిప్ ఇస్తున్నట్లు ప్రకటించారు.

హక్కుల సాధనకు పోరాటం

తిరుపతి కల్చరల్ : కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రప్రభుత్వంపై సమష్టిగా హక్కుల సాధనకు పోరాటం సాగించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.రాధాకృష్ణ, కందారపు మురళి పిలుపు నిచ్చారు. కేంద్ర నూతనంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిరుపతిలో బ్లాక్‌డే నిరసన చేపట్టారు. అందులో భాగంగా పాత మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు ఎర్రజెండాలు చేతపట్టి కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికులు సమ్మె చేయడం, యాజమాన్యాలను ప్రశ్నించే హక్కులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ అధికారులు ఉత్సవ విగ్రహాల్లా మారిపోతారని వెల్లడించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమలత, ఏఐటీయూసీ నేతలు శ్రీరాములు, గోవిందస్వామి, బాబు, మహేంద్రరెడ్డి, బాల, ఏపీ బాల, వెంకటేష్, శ్రీనివాసులు, నరసింహులు, సీఐటీయూ నేతలు బుజ్జి, రామకృష్ణ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు

ప్రజా సహకారంతోనే 'స్వచ్ఛ తిరుపతి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: ప్రజా సహకారంతోనే స్వచ్ఛ తిరుపతి సాధ్యమవుతుందని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్య క్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు రోజూ ఒక్కో థీమ్‌తో తిరుపతి నగరంలో అవగాహ న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. తడి,పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేయడంపై అవగాహన కల్పించామన్నారు. నగరంలోని కొన్ని చెత్త డంప్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించి అక్కడ మొక్కలు నాటామని చెప్పారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నగరవాసులు ఇబ్బంది పడకుండా రోడ్లపై గుంతలను బాగు చేస్తున్నామని తెలిపారు. మ్యాప్ మై ఇండియా యాప్ ద్వారా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. ఈ నెల 26వ తేదీన పర్యాటక శాఖ సహకారంతో ఇందిరా మైదానంలో వీధి నాటకాలు, ఇండోర్ స్టేడియంలో శానిటరీ వర్కర్స్‌కి ఆరోగ్య పరీక్షలు, పీపీ ఈ కిట్లు పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యార్థులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులతో కచ్చపి ఆడిటోరియంలో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో ఉత్తమంగా గుర్తించిన వాటికి బహుమతు లు ఉంటాయని చెప్పారు. ఇందుకోసం ఆసక్తి గలవారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాల ని సూచించారు. ఈ క్రమంలోనే వివేకానంద సర్కి ల్ నుంచి ఎస్వీయూ వరకు పరుగు పందెం చేపట్టనున్నట్లు వెల్లడించారు. విజేతలకు బహుమతులు ఉంటాయన్నారు. అలాగే వినాయకసాగర్‌తో పాటు పార్కుల పరిశుభ్రతకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 44 వినతులు

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 44 వినతులు వచినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్‌ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు సంజయ్ కుమార్, మహేష్, రాజు, శ్రావణి, నరేంద్ర, సెక్రటరీ రాధిక, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, కేఎల్ వర్మ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ చిట్టిబాబు, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖధికారి హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ప్రదానం



ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లకు బి– సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సోమవారం 5 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అనూజ్ వాద్వా పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన 31 మందికి సర్టిఫికెట్లు అందించారు. ప్రిన్సిపల్ నారాయణమ్మ మాట్లాడుతూ ఎన్‌సీసీ సర్టిఫికెట్‌లో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే ఢిల్లీలో ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంపునకు ఎంపికై న ఎన్‌సీసీ క్యాడెట్లు పి.భాగ్యశ్రీ, డి.అనుషా, సాయిగోపిక, శిరీషకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ అధికారి సీహెచ్ సుహాసిని, ఎం.హేమలత, డాక్టర్ వరప్రసూన, నాయక్ సుబేదార్ కైలాష్ కుమార్, హవల్దార్ వెంకటేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు క్రీడా దుస్తులు



క్రీడా దుస్తులు ఆవిష్కరిస్తున్న ప్రెస్‌క్లబ్ కమిటీ

తిరుపతి కల్చరల్: తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టులకు సోమవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రూ.3.5లక్షలతో సమకూర్చిన టీ– షర్ట్ , లోయర్, టోపీలను అందజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి , సెక్రటరీ బాలచంద్ర, ట్రెజరర్ శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ లావణ్య కుమార్, ఈసీ మెంబర్ సునీల్, మాజీ ఉపాధ్యక్షుడు ప్రకాష్ బాబు, ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ దినేష్, ఈసీ మెంబర్లు లావణ్య కుమార్, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

మహా కుంభమేళాపై సమావేశం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో ఇండియా థింక్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహా కుంభ మేళా–2025పై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని వర్సిటీలో సోమవారం నిర్వహించారు. సనాతన ధర్మం, ఆలయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ఆధునిక తరాలకు ఏ విధంగా అందించాలనే అంశాలపై ప్రతి రాష్ట్రంలో జరిగుతున్న నేపథ్యంలో సోమవారం వర్సిటీలో రౌండ్‌టేబుల్ సమావేశంలో చర్చించారు. 2025లో ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభ మేళాకు సంబంధించి ప్రజలు, భక్తులు అవలంబించాల్సిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, ఇండియా థింక్ కౌన్సిల్ డైరెక్టర్ సౌరవ్ పాండే, అధ్యాపకులు డాక్టర్ కుమార్ బాగేవాడి, డాక్టర్ చారుకేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో కక్షగట్టి బదిలీలు

తిరుపతి తుడా: మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగుల బదిలీల్లో రెడ్‌బుక్ మార్క్ కనిపిస్తోంది. కొందరు అధికారులపై కక్షగట్టి బదిలీ చేసినట్లు అర్థమవుతోంది. గతంలో నిక్కచ్చిగా విధులు నిర్వర్తించిన అధికారులపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేశారు. ఆ మేరకు ఇప్పుడు దూర ప్రాంతాలకు బదిలీ చేసి జబ్బలు చరుచుకుంటున్నారు. ఈ క్రమంలోని కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు కేఎల్ వర్మ, చిట్టిబాబుపై బదిలీ వేటు వేశారు. వర్మను బాపట్ల, మేనేజర్ చిట్టి బాబును అమలాపురానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. అలాగే ఎస్‌ఈ మోహన్‌ను నెల్లూరు, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డిని చిత్తూరుకు పంపించారు. ఈఈ దేవికను కడప, డీసీపీ శ్రీనివాసులరెడ్డిని అనంతపురానికి బదిలీ చేశారు.

భారీగా ఏపీపీల బదిలీ

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వివిధ కోర్టుల్లో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు(ఏపీపీ), అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల(ఏపీపీ)ని బదిలీ చేస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న ఎం.కే విజయలక్ష్మి నెల్లూరు ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు, అలాగే నెల్లూరు ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న ఎస్‌వీఎస్‌ఎల్‌ఎస్‌ఆర్‌వీ ప్రసాద్ తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఏపీపీగా బదిలీ అయ్యారు. అలాగే చిత్తూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏపీ గ్రేడ్–2గా ఉన్న జీఎస్ శైలజను మదనపల్లె ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏపీపీగా, మదనపల్లె కోర్టు సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న కె.ఉమాదేవిని చిత్తూరు నాలుగో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఏపీపీగా బదిలీ చేశారు. చిత్తూరు నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీగా ఉన్న సి.కృష్ణారెడ్డి మదనపల్లె కోర్టు ఏపీపీగా, అలాగే కర్నూలు ఎక్సైజ్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న డి.విష్ణువర్ధన్ రెడ్డి పలమనేరు కోర్టు ఏపీపీగా బదిలీ అయ్యారు. అలాగే చిత్తూరు ప్రత్యేక మొబైల్ కోర్టు ఏపీపీగా ఉన్న ఎం.శ్రీలతను ఎమ్మిగనూరు కోర్టు ఏపీపీగా, రాయచోటి కోర్టు ఏపీపీ జి.సుజాతను తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏపీపీగా, శ్రీకాళహస్తి కోర్టు ఏపీపీ పి.జయశేఖర్‌ను తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఏపీపీగా బదిలీ చేశారు. తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఏపీపీ ఎం.జ్యోతి జమ్మలమడుగు కోర్టు ఏపీపీగా, తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఏపీపీ కె.నిర్మల పుత్తూరు కోర్టు ఏపీపీగా బదిలీ అయ్యారు. అలాగే పుత్తూరు కోర్టు ఏపీపీ ఎస్.నయిమున్నీసాబేగంను శ్రీకాళహస్తి కోర్టు ఏపీపీగా, సత్యవేడు కోర్టు ఏపీపీ పి.ప్రశాంతిని కుప్పం కోర్టు ఏపీపీగా, కుప్పం కోర్టు ఏపీపీ ఎం.లతను సత్యవేడు కోర్టు ఏపీపీగా, తంబళ్లపల్లె కోర్టు ఏపీపీ టి.రామకృష్ణను కల్యాణదుర్గం కోర్టు ఏపీపీగా, జమ్మలమడుగు కోర్టు ఏపీపీ కె.వీరాంజనేయులును తంబళ్లపల్లె మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యూడీఎస్ పూర్తి చేయాలని వినతి

తిరుపతి రూరల్ : తుడా నిధులతో పంచాయతీలో చేపట్టిన యూడీయస్ పనులను వెంటనే పూర్తి చేయించాలని కూపుచంద్రపేట సర్పంచ్ పిపాసీ కోరారు. సోమవారం ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గ్రామస్తులు హరికృష్ణ, జనార్దన్, చలపతితో కలిసి ఎంపీడీఓ రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. పిపాసీ మాట్లాడుతూ గ్రామంలో రూ.20 లక్షల తుడా నిధులతో అండర్ డ్రైనేజీ సిస్టమ్(యూడీయస్) పనులు ప్రారంభించినట్లు తెలిపారు. దీనికోసం గ్రామంలోని ప్రతి వీధిలో పెద్ద పెద్ద గోతులు తీసినట్లు చెప్పారు.5 నెలలుగా ఈ గోతులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న యూడీయస్ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసి గోతుల నుంచి విముక్తి కలిగించాలని వినతిలో పేర్కొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ పిపాసీ